# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ జల సంరక్షణకు ఆధునిక పరిష్కార మార్గాలతో ముందుకు రావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ మహిళల భాగస్వామ్యంపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ❖ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే 15 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకురాలు అతిశీను ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఈరోజు ఆ పార్టీ ప్రకటించింది.
- ❖ హాకీ పురుషుల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ లో చైనాపై భారత్ విజయం సాధించి 5వ సారి టైటిల్ ను కైవసం చేసుకుంది.

==============================

జల సంరక్షణకు ఆధునిక పరిష్కార మార్గాలతో ముందుకు రావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత మండపంలో 8వ ఇండియా వాటర్ వీక్ సదస్సును ఈరోజు ప్రారంభించిన రాష్ట్రపతి నీటి సంరక్షణ మార్గాలతో, మెరుగైన నిర్వహణ, పంపిణీ లక్ష్యాల సాధనకు అందరం కలిసికట్టుగా పని చెయ్యాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. జలవనరుల నిర్వహణపై దేశంలో అనేక పురాతన పద్ధతులు ఉన్నాయని, వాటిని ఆధునిక రూపంలో వర్తింపజేయాలని ద్రౌపది ముర్ము పేర్కొంటూ....

(వాయిస్ 33 సెకన్లు)

నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 40 దేశాలకు చెందిన రెండు వందల మంది విదేశీ ప్రతినిధులతో సహా సుమారు 4 వేల మంది ప్రతినిధులు వందకు పైగా అంకుర సంస్థలు జల సంరక్షణలో తమ ఆలోచనలను పరస్పరం పంచుకోనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల భాగస్వామ్యంపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈరోజు భువనేశ్వర్‌లో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన పథకమైన "సుభద్ర యోజన"ను ఆయన ప్రారంభించారు. అనంతరం భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... కోటి మందికి పైగా మహిళలు 'సుభద్రా యోజన'ను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్‌ను కూడా ఈ "సుభద్ర యోజన"కు అనుసంధానం చేశామని ప్రధాన మంత్రి తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో భాగంగా 2 వేల 800 కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు, వెయ్యి కోట్ల రూపాయల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే 14 రాష్ట్రాలకు చెందిన 10 లక్షల మంది "ప్రధానమంత్రి ఆవాస్ యోజన" లబ్ధిదారులకు 3 వేల 180 కోట్ల రూపాయల సహాయాన్ని మొదటి విడతగా నరేంద్ర మోడీ విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకురాలు అతిశీను ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఈరోజు ఆ పార్టీ ప్రకటించింది. న్యూఢిల్లీలో జరిగిన పార్టీ శాసన సభ్యుల సమావేశంలో ఆమెను ఆ పార్టీ లెజిస్లేటివ్ పార్టీ నాయకురాలిగా ఎన్నుకున్నారు. సమావేశం అనంతరం నగర మంత్రి గోపాల్ రాయ్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు అతిశీ ముఖ్యమంత్రిగా ఉండాలని ఏకగ్రీవంగా నిర్ణయించామని తెలిపారు. ఇటీవల బెయిల్ పై జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఈమేరకు కేజ్రీవా ఈరోజు సాయంత్రం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి తన రాజీనామాను సమర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హాకీ పురుషుల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీని భారత్ మరోసారి కైవసం చేసుకుంది. ఈరోజు సాయంత్రం చైనాలోని హులున్ బుయిర్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ లో ప్రత్యర్థి చైనాను 1-0 తేడాతో ఓడించి భారత్ 5వ సారి ఛాంపియన్ గా నిలిచింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్ నాల్గవ క్వార్టర్‌లో భారత ఆటగాడు జుగ్‌రాజ్ సింగ్ గోల్ చేసి భారత్ ను విజయతీరాలకు చేర్చాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచిన భారత్ 5 టైటిల్స్‌తో పోటీలో అత్యంత విజయవంతమైన జట్టుగా చరిత్ర సృష్టించింది. కాగా ఇప్పటివరకు జరిగిన 8 ఎడిషన్లలో భారత్ 6 సార్లు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ కు చేరుకుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వరుసగా మూడవసారి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈరోజుతో వంద రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా, సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ మోడీ 3.0 పేరిట ఒక బుక్‌లెట్ ను విడుదల చేశారు. అనంతరం హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... ప్రభుత్వం ఈ 100 రోజుల హయాంలో 15 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిందని అన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను సృష్టించడానికి, పేద, మధ్యతరగతి ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికి అనేక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. డిజిటల్ ఇండియా సాధించిన విజయాలను ప్రశంసించారు. సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రంగా ఎదుగుతుందని అమిత్ షా పేర్కొంటూ ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పారిస్ ఒప్పందంలోని అన్ని సూచీలను గడువు కంటే ముందే చేరుకున్న అతికొద్ది దేశాల్లో భారత్ నిలిచిందని కేంద్ర, అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు 19వ సీఐఐ-ఐటీసీ సుస్థిరత సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... సుస్థిర జీవనశైలికి మార్గం సుగమం అవుతుందని, పునర్వినియోగం, రీసైక్లింగ్‌పై ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. ప్రతి ఒక్కరికీ గౌరవ ప్రదంగా జీవించే హక్కు ఉందని, సుస్థిరత దీనికి ప్రధాన అంశమని మంత్రి పేర్కొన్నారు. సుస్థిర వాతావరణాన్ని సాధించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి 23 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఈనెల 21వ తేదీన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆధ్వర్యంలో విల్మింగ్టన్ వేదికగా జరగనున్న 4వ 'క్వాడ్ సదస్సు'లో నరేంద్రమోదీ పాల్గొంటారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా ఈ సంవత్సరం క్వాడ్ సదస్సు భారత్‌లో నిర్వహించాల్సింది.. కానీ అమెరికా విజ్ఞప్తి మేరకు 2025లో నిర్వహించేందుకు భారత్ అంగీకరించింది. క్వాడ్‌లో భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ సభ్యదేశాలుగా ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈరోజు న్యూ ఢిల్లీలో COP-9 బ్యూరో 2వ అధికారిక సమావేశానికి, ఫండ్ అప్రూవల్ కమిటీ యొక్క 3వ సమావేశానికి అధ్యక్షత వహించారు. క్రీడల్లో డోపింగ్‌ను అరికట్టడానికి యునెస్కో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఫండ్ అప్రూవల్ కమిటీ సమావేశాలు చేపడుతోంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ అత్యున్నత స్థాయి సమావేశాలు డోపింగ్‌కు వ్యతిరేకంగా పోరాడటంలో ప్రపంచ సహకారాన్ని ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రపంచ డోపింగ్ నిరోధక ప్రయత్నాల్లో ప్రముఖ పాత్ర పోషించడానికి భారతదేశం యొక్క నిబద్ధతను డాక్టర్ మాండవియ తన ప్రారంభ ప్రసంగంలో ప్రస్తావించారు. భవిష్యత్ తరాలకు క్రీడల సమగ్రతను కాపాడటంలో అంతర్జాతీయ సహకారం కీలక పాత్ర అని ఆయన వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్కొక్కటి 0.1 శాతం లాభంతో ఈరోజు సానుకూలంగా ముగిశాయి. ముగింపు సమయానికి సెన్సెక్స్ 90 పాయింట్లు లాభపడి 83 వేల 079 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 34 పాయింట్లు లాభపడి 25 వేల 418 వద్ద ఉన్నాయి. ఎన్ఎస్ఈలో 148 కంపెనీలు 52 వారాల గరిష్ట స్థాయిని తాకగా, 28 కంపెనీలు 52 వారాల కనిష్ట స్థాయిని తాకాయి. సెన్సెక్స్ సూచీలో 30 కంపెనీల్లో 15 లాభాలతో స్థిరపడ్డాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి 13 పైసలు పెరిగి 83 రూపాయల 75 పైసలకు చేరుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =